

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెలికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెలికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి.  అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 52

## జీవితం (రెండు)

**ఇంజిరీంగ్ కాలేజీలో** లెక్చరర్ గా జేరిన రెండు నెలలక్కాబోలు రమేష్ అమెరికా రావడానికి రాయబోయే పరీక్షలకి పుస్తకాలు కొని చదవడం మొదలుపెట్టాడు. కంప్యూటర్లు మెల్లిగా మార్కెట్లోకి వస్తున్నై. తాను చదువుకున్నది మెకానికల్ ఇంజినీరింగ్ కనక ఏదో ఒక యూనివర్సిటీలో సీటు వస్తుందా అనేది చెప్పడం కష్టం కానీ బోల్డు మంది అమెరికా వెళ్తున్నారు కదా, తానూ వెళ్ళలేడా అని ఆశ. పరీక్షల మార్కులొచ్చేసరికి ఎవరు చెప్పారో ఎక్కడో చూసుకోకుండా రైస్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్, జాన్స్ హాప్కిన్స్ అనే మంచి యూనివర్సిటీలకి పంపించేడు అప్లికేషన్లు. మూడు నెలలు గడిచాక వచ్చిన ఉత్తరాల్లో – "అబ్బే మీరిక్కడ పనికిరారు" అనే సమాధానం కనిపించింది. డీలా పడిపోయి అమెరికాలో ఉంటున్న షావుకారు మేనల్లుడికి ఓ ఉత్తరం రాసి పడేసాడు. మరో రెండు నెలలకి ఆయన్నుంచి ఉత్తరం వచ్చింది – "మీరు అప్లికేషన్లు పంపిన కాలేజీల్లో ఐఐటి వాళ్ళకే సీట్లు రావడం కష్టం. అందువల్ల ఈ సారి మరో ప్రయత్నం చేయండి చిన్న చిన్న యూనివర్సిటీల్లో" అంటూ కాన్సాస్ లో ఓ రెండూ, మరోచోట రెండు యూనివర్సిటీల పేర్లు పంపేడు ఆయన. సమయం గడిచిపోయింది కనక ఆ ఏడు అకాడెమిక్ ఇయర్ పోయినట్టే.

పై ఏడాదికి మళ్ళీ పునః ప్రవేశం. ఈ సారి షావుకారి మేనల్లుడు చెప్పినట్టూ మూడు చోట్లకి అప్లికేషన్లు పంపించేడు. జూన్ నెల గడుస్తూంటే సమాధానం వచ్చింది. కాన్సాస్ లో వచ్చింది సీటు, డబ్బులు మాత్రం ఇవ్వరుట. అయితే జనరల్ టాక్ ఏమిటంటే ఓ సారి వెళ్ళగానే ఏదో ఒక ఆసరా దొరుకుతుంది. వెంఠనే ఇంటికెళ్ళి తండ్రితో చెప్పేడు. ఆయన కష్టం ఆయనది కదా? వెళ్ళడానికి, మొదట్లో కుర్రాడు చెప్పినట్టూ ఒకట్రెండు సెమెస్టర్లకి డబ్బులు పెట్టుకోవాలి. అంతా కలిపి పదో పదిహేనో లక్షలౌతుంది. మొత్తానికి, అటూ ఇటూ వాదోపవాదాలు అయ్యేక కుర్రాడు ఆగస్టులో విమానం ఎక్కేసేడు. కాన్సాస్ లో దిగేక మిగతా విషయాలు తెలిసేయి.

యూనివర్సిటీ డబ్బులు అప్పుడే ఇవ్వరు. రెండు సెమెస్టర్లు ఆగాలి. అవొచ్చాక మరో రెండు సెమెస్టర్ల వరకూ చదువు ఉండొచ్చు. తర్వాత ఉద్యోగం వెతుక్కుంటే బాగుండొచ్చు. కానీ తనది మెకానికల్ బ్రాంచ్ కనక అంత సులభంగా ఏ ఫోర్డ్ కంపెనీయో ఉద్యోగం ఇచ్చేయదు. మిగిలిన దారి ఓ కంప్యూటర్ లాంగ్వేజ్ నేర్చేసుకుని కోడ్ కూలీ అవ్వడమే. ఈ లోపుల తెల్సిన విషయం తమ కూడా ఉన్న చందర్రావు అనేవాడు – ఒక తెల్ల అమ్మాయిని కలిసాడు యూనివర్సిటీలో పనిచేసేచోట. ఏం పని? రాత్రప్పుడు క్లాసుల్లోని ఆకుపచ్చ బోర్డులుంటాయి చూసారా అవి తుడవాలి. అదీ ఉద్యోగం. మరో నెలలో విన్న విషయం – చందర్రావు ఆ తెల్లమ్మాయిని పెళ్ళి చేసేసుకున్నాడు. డేటింగ్ అదీ జాంతానై. డైరక్ట్ గా రెండునెలల్లో ఎలా పెళ్లైపోయిందో అయిపోయింది. అప్పట్నుంచి రమేష్ కి వాడంటే కుళ్ళు. ఇదంతా ఎందుకంటే తనకో తెల్లమ్మాయి దొరకలేదని. అసలు పెళ్ళి చేసుకుంటే తెల్లమ్మాయిని చేసుకోవాలి గానీ రోడ్డుమీద పోయే అందర్నీ చేసుకుంటారా? ఇది జరిగిన పది వారాల్లో చందర్రావు యూనివర్సిటీలోంచి పట్టా పుచ్చుకుని బయట దర్జాగా ఉద్యోగం సంపాదించేడుట.  ఆగండాగండి. ఉద్యోగానికి వీసా వచ్చిందా అనే పిచ్చి ప్రశ్న వేస్తారేం? తెల్లమ్మాయిని చేసుకుని డైరక్ట్ గా గ్రీన్ కార్డ్ సంపాదించినవాడికి వీసా దేనికి? అలా రమేష్ కుళ్ళు మరింత ఎక్కువైంది. ఈ లోపుల మరో రూమ్మేట్ వచ్చి చేరాడు రమేష్ అపార్ట్ మెంట్ లో. ఎవరో తెలిసిన స్టూడెంట్ కారు కొన్నాట్ట. అది చూడ్డానికి వెళ్తే తెల్సిన విషయం ఆయన కొన్నది అతి కొత్త కారు. డబ్బులెక్కడివో, ఉద్యోగం రాకుండా అని అడగడానికి రమేష్ నోటి చివరి వరకూ వచ్చింది కానీ అడిగితే ఈడ్చి చెంపమీద కొడతాడు కనక నోరుమూసుకుని వెనక్కొచ్చాడు. వచ్చిన తర్వాత మళ్ళీ ఏడుపు. చందర్రావు కి ఉద్యోగం వచ్చినందుకూ, ఈ కుర్రాడు కొత్త కారు కొన్నందుకూ తనకేమీ లేనందుకూను.

అయితే చివరి సెమెస్టర్ లో రమేష్ తన రూమ్మేట్ తో మాట్లాడుతున్నప్పుడు తనకి లేనివీ కొనబోయేవీ (అదే ఉజ్జోగం వచ్చాక) చెప్పుకున్నప్పుడు అడిగేడు రమేష్ – రూమ్మేట్ కొనబోయే కారేమిటో. “మాంచి ఎస్ యు వి కొనుక్కోవాలి కానీ కారు దేనికీ?” అలా రూమ్మేట్ రమేష్ ని ఊరించేడు. అయితే ఇప్పటివరకూ తాను మాట్లాడే మాటల్లో తన కుళ్ళు బయటపడుతోందని రమేష్ కి తెలియలేదు. తెల్సిన రూమ్మేట్ కి ఈయన్ని ఏడిపించడమే లక్ష్యం. నాలుగో సెమెస్టర్ అయ్యాక చిన్నపాటి ఉద్యోగం సంపాదించేడు రమేష్. తెల్సిందే కదా ముందు ఉజ్జోగంలో జేరేటప్పుడే గ్రీన్

కార్డుకీ, వీసాకీ పేపర్లు ఇస్తారా అని అడగడం, అది ఒప్పుకుంటే ముందుకి లేదా ఎవరికి వారే యమునా తీరే. అయితే ఉద్యోగం ఇచ్చే కంపెనీ ఐడియాలు వేరు. ఈ కుర్రాడికి ఒక ఏడాది పనిచేసే హక్కు ఉంది. చూద్దాం ఈ లోపుల వీడు బాగా పనిచేస్తే పేపర్లు ఇవ్వొచ్చు లేదా పని చేయడానికి ప్రోజక్ట్ లో డబ్బులు లేకపోతే బయటకి పంపొచ్చు. అవసరం కుర్రాడిదే ఎక్కువ కనక జీతం బేరం ఆడ్డం సులభం. అలా 'కుబేరసమో భవేత్' అయిపోదామనుకున్న కుర్రాడికి నలభై వేల జీతం తో ఉద్యోగం వచ్చింది. రూమ్మేట్ ఊరడించేడు. "ఫర్లేదు ముందు జేరిపోండి. తర్వాత గ్రీన్ కార్డొస్తే ఉద్యోగం మారొచ్చు" అంటూ – అక్కడకి ఉద్యోగాలు కుప్పలు తెప్పలుగా ఉన్నట్టు. ఉద్యోగం జేరిన రమేష్ కి త్వరలోనే తెలిసొచ్చింది. తనకొచ్చే జీతంలో దాదాపు మూడో వంతు పన్నులకి పోతుంది. మిగిలినదాంట్లో మెడికల్ ఇన్స్యూరెన్సూ, రిటైర్ మెంటు డబ్బులూ, నెలనెలా కొత్త కారుకి కట్టవల్సిన డబ్బులూ తీసేస్తే హళ్ళికి హళ్ళి సున్నకి సున్నా. అద్దైనా తను కొనగలిగే కారు టయోటా అనుకుంటే. దీని మీద మరో దెబ్బ తగిలింది తర్వాత కారు కొనడానికి వెళ్ళినప్పుడు. తాను నెల నెలా కట్టగలిగే డబ్బుతో టయోటా రాదు. ఫోర్డ్ కారు వస్తుంది. అలా కుబేర సమోభవేత్ కల నాశనం అయ్యాక, ఎస్ యు వి కారు కొనే కల నాశనం అయింది.

మిగిలినవి ఉద్యోగంలో గ్రీన్ కార్డు సంపాదించడం, పెళ్ళీ పిల్లలూ వగైరా అని కదా అనుకున్నది? అమెరికా వస్తే ఏడుపు తగ్గుతుందనుకున్న కుర్రాడికి ఎందుకో తమ ఊర్లో షావుకారు మళ్ళీ గుర్తొచ్చాడు. ఆయన తమ ఊళ్ళోనే ఇల్లూ అదీ కొని హాయిగా ఉన్నాడు. తానో? ఎంత దాచుకున్నా ఆగని ఏడుపు, రోజు విడిచి రోజు తగిలే దెబ్బ మీద దెబ్బలు. తాను అనుకున్నది జీవితం వేరు. ఎదురుగా రోజువారీ గడిపే జీవితం వేరు. మిగతా అందరికీ అలా లేదే? తెల్లమ్మాయిని పెళ్ళి చేసుకోవడం అటుంచి వాళ్ళు తనతో మాట్లాడ్డమే లేదు. ఏం జరుగుతోంది తనకి? ఇదేనా అమెరికా, లేండ్ ఆఫ్ ఆపర్చ్యునిటీ అంటే? ఆ రోజు నిద్రపట్టక కుళ్ళి కుళ్ళి ఏడిచేడు ఇంజినీర్ రమేష్.

నీతి: కలలు వేరు, జీవితం వేరు. ప్రపంచంలో ఎక్కడైనా కానీ కాళ్ళు నేలమీద ఆనకపోతే ఏడుపు తప్పదు.

Post your comments